రావినారాయణరెడ్డికి ఘన నివాళి

రావినారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 4: మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ రావినారాయణ రెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ.. దాదాపు 700 ఎకరాల సొంత భూమిని నిరుపేదలకు పంచిన తొలి భూపోరాట నాయకుడు రావినారాయణరెడ్డి అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితోనే కుంట్లూరు పరిధిలోని మూడు కాలనీలను రావినారాయణరెడ్డి పేరుతో భూపోరాటం ద్వారా గుడిసెలు వేసి ఇల్లు లేని నిరుపేదలకు సీపీఐ ఆధ్వర్యంలో స్థలాలు పంచామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు వేశారు..నీళ్లు మరిచారు

నీళ్లు లేక ఎండిపోయిన సీసీ రోడ్డు

యాచారం, జూన్4: మండలంలోని నందివనపర్తిలో 9వ వార్డులో ఐదు రోజుల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ రూ.15 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డు వేసిన అధికారులు నీళ్లు పోయడం మరిచారు. దీంతో మండే ఎండలకు సీసీ రోడ్డు ఎండిపోతుంది. రోడ్డుపై కట్టలు కట్టి క్యూరింగ్ చేసే వారు కరువయ్యారు. దీంతో సీసీ రోడ్డు నాణ్యత క్రమంగా తగ్గిపోతుంది. ఇలాగే నీళ్లు పోయకుండా నిర్లక్ష్యం వహిస్తే రోడ్డు పగుళ్లు వచ్చి బీటలు బారనుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సీసీ రోడ్డుకు నీళ్లు పోయడం లేదని వాపోతున్నారు. రోడ్డును పర్యవేక్షించాల్సిన పంచాయతీ రాజ్ అధికారులు పత్తా లేక పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సీసీ రోడ్డుపై దృష్టి సారించి సరిపడా నీళ్లు పోయించాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఎల్లమ్మతండాలో విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న ఏఈవో

మంచాల, జూన్ 4 : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈవో లింగస్వామి అన్నారు. మంగళవారం మంచాల మండలం ఎల్లమ్మతండా గ్రామంలో విత్తనాల కొనుగోలుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినట్లైతే వెంటనే డీలర్ల నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న కౌండిన్య పొదుపు సంఘం సభ్యులు

షాబాద్, జూన్ 4: నాగరకుంట గ్రామానికి చెందిన కలాల్ కిష్టప్పగౌడ్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న షాబాద్ మండల కౌండిన్య పొదుపు సంఘం సభ్యులు, గౌడ సంఘం సభ్యులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో కౌండిన్య పొదుపు సంఘం సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

గెలుపు సంబురం

షాబాద్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో సంబురాల్లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

షాబాద్, జూన్ 4 : చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడిగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఘనవిజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు నిర్వహించారు. మండలంలోని మన్‌మర్రి, షాబాద్ గ్రామాల్లో బీజేపీ నాయకులు బాణాసంచాలు కాల్చి, బైకు ర్యాలీలు నిర్వహించి, స్వీట్లు తినిపించుకుని సంబురాలు చేసుకున్నారు.కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సత్యం, చంద్రశేఖర్ రెడ్డి, నర్సింహులుగౌడ్ తదితరులున్నారు.

మొయినాబాద్ : చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గున్నాల గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ సహదేవ్, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీరాములు, పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, జ్ఞానేశ్వర్, రాజమల్లేశ్, అశోక్ , రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమనగల్లు : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీగా మల్లురవి ఘన విజయం సాధించడంతో ఆమనగల్లు మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కో ఆర్డినేటర్ వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. హైదరాబాద్ –శ్రీశైలం జాతీయ రహదారిపై బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు జంతుక యాదయ్య, జలాల్, అయోధ్య, మహేశ్, రవి పాల్గొన్నారు.

కడ్తాల్ : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీగా మల్లు రవి గెలుపొందడటంతో మంగళవారం సాయంత్రం కడ్తాల్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, చందోజీ, హన్మానాయక్, జహంగీర్‌బాబా, వేణుగోపాల్, జహంగీర్‌అలీ, అసిఫ్‌అలీ, సుధాకర్‌గౌడ్, బుచ్చయ్య, భిక్షపతి, ఆజ్గర్ అలీ, రాజేశ్, భానుకిరణ్, లక్పతీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీలాపడ్డ కాంగ్రెస్

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 41,000 మెజార్టీ రాగా.. ప్రస్తుతం 3,969 ఓట్ల మెజార్టే
- అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ

పార్టీపేరు	అభ్యర్థి పేరు	పోలైన ఓట్లు
కాంగ్రెస్	చామల కిరణ్‌కుమార్‌రెడ్డి	88,013
బీజేపీ	బూర నర్సయ్యగౌడ్	84,044
బీఆర్ఎస్	క్యామ మల్లేశ్	39,541

గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు..

పార్టీపేరు	అభ్యర్థి పేరు	పోలైన ఓట్లు
కాంగ్రెస్	మల్‌రెడ్డి రంగారెడ్డి	1,26,506
బీఆర్ఎస్	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	89,806
బీజేపీ	నోముల దయానంద్	15,790

ఇబ్రహీంపట్నం, జూన్ 4 : నియోజకవర్గంలో భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 41 ,000 మెజార్టీ రాగా.. ప్రస్తుతం ఆ పార్టీకి 3,969 ఓట్ల మెజార్టీ మాత్రమే వచ్చింది. కాగా ఈ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకున్నది. గత శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీకి 15,790 ఓట్లు రాగా, ప్రస్తుతం 84,044 ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కాగా, బీఆర్ఎస్‌కు గతంలో 89,806 ఓట్లు రాగా, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 39,500 ఓట్లు సాధించి మూడోస్థానానికి పరిమితమైనది. నియోజకవర్గంలో బీజేపీ ఒక్కసారిగా పుంజుకోవటంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు..

ఈ సెగ్మెంట్‌లో మొత్తం ఓట్లు 3,39,340 ఉన్నాయి. ఎంపీ ఎన్నికల్లో 2,26,790 ఓట్లు పోల్ కాగాఓటింగ్ శాతం 66.83గా నమోదైంది.

బీజేపీ శ్రేణుల గెలుపు సంబురాలు

మణికొండ, జూన్ 4 : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గండిపేట మండలంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో చేవెళ్ల పార్లమెంటు ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీ నమోదు చేసుకోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబురాలను జరుపుకున్నారు. మోదీ మానియాతో భారీ మెజార్టీ వచ్చిందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అంజన్‌కుమార్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా మణికొండ మర్రిచెట్టు సమీపంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. వట్టినాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, మంచిరేవుల గ్రామాల్లో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలను జరుపుకున్నారు.

రాజేంద్రనగర్‌లో..

బండ్లగూడ: చేవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో బీజేపీ నాయకులు సంబురాలను జరుపుకున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. జై బీజేపీ అంటు నినాదాలు చేశారు. బండ్లగూడ అరె మైసమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్,జిల్లా మోర్చా కార్యదర్శి కోరని క్రాంతి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్,రవీందర్,పవన్ రాజ్,మల్లేశ్,వేణు,రఘుమారెడ్డి,స్వామి,పెంటయ్య,లక్ష్మీనారాయణ,అరుణ్,మహలింగంగౌడ్,మల్లారెడ్డి,నరేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి లో...

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల గడ్డపై కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సాధించిన విజయం ప్రజల గెలుపు అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్, రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, మజర్, శివ, బబ్లు, జబ్బార్ పాషా, గణేశ్, అనీశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్ రూరల్: చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో పార్టీ నాయకులు శంషాబాద్ పట్టణంలో పటాకులు కాల్చుతూ స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తారని వివరించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందకిశోర్,పరమేశ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సిట్టింగ్ స్థానం హుష్‌కాకి

'చే'జారిన దేశంలోనే అతి పెద్ద స్థానం

మల్కాజిగిరి

రేవంత్ ప్రాతినిధ్యం వహించిన స్థానం కోల్పోవడంపై పెద్ద ఎత్తున చర్చ

ఆచితూచి అడుగేసినా తప్పని ఓటమి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 4 (నమస్త తెలంగాణ): 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రాతినిధ్యం వహించే రెండు నియోజకవర్గాలు కలిపినా నా నియోజకవర్గం (మల్కాజిగిరి పార్లమెంటు స్థానం) అంత పెద్దగా ఉండవు. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి నేను ప్రాతినిధ్యం వహిస్తున్నాను...' నిన్నటిదాకా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానంపై చెప్పుకునే గొప్పలివి. కానీ తాజా ఫలితాల్లో మల్కాజిగిరి 'చే'జారిపోయింది. సీఎం రేవంత్ సిట్టింగ్ స్థానంలో హస్తం హవా కొనసాగించాలని తీవ్ర ప్రయత్నాలు చేసి, ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు. ఇదే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే కాదు.. తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ మహా నగర పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి ఒక చరిత్ర ఉంది. గతంలో దేశంలోనే అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గంగా ఖైరతాబాద్ ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఖైరతాబాద్ ఆ ప్రాధాన్యతను కోల్పోయింది. ఖైరతాబాద్‌తో పాటు జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలుగా ఏర్పడ్డాయి. ఇదే సమయంలో లోక్‌సభ స్థానాలు కూడా పునర్విభజన జరగడంతో సిద్దిపేట స్థానంలో మల్కాజిగిరి పార్లమెంటు స్థానం ఏర్పడింది. మల్కాజిగిరి, కంటోన్మెంట్, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానాలతో ఏర్పడిన ఈ నియోజకవర్గం దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ స్థానంగా ఆవిర్భవించింది. ఈ క్రమంలో 2019 పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఐదేళ్లు తిరిగేసరికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో మల్కాజిగిరి పార్లమెంటు స్థానం ప్రాధాన్యత మరింత పెరిగింది. అందులో భాగంగానే తాజా పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. దేశంలోనే అతి పెద్ద నియోజకవర్గంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కావడంతో ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా భావించింది. రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గానే తీసుకొని అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ వరకు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా అభ్యర్థి ఎంపిక విషయంలో పూర్తిగా సీఎం తన సొంత నిర్ణయాన్ని తీసుకొని, అధిష్ఠానాన్ని ఒప్పించారని పార్టీ వర్గాలే తెలిపాయి.

వికారాబాద్ నుంచి తరలింపు..

వాస్తవానికి చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని ఆశించి పట్నం దంపతులు బీఆర్ఎస్‌ను వీడి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారనేది బహిరంగ రహస్యం. కానీ సీఎం మాత్రం తన సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలోకి దింపేందుకు నిర్ణయించారు. మల్కాజిగిరి పరిధిలోని కాంగ్రెస్ నేతలు, ఇతర నాయకులు అక్కడి నుంచి పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ సీఎం మాత్రం పట్టుబట్టి సునీతా మహేందర్‌రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నారు. అప్పుడు మొదలు పోలింగు వరకు కూడా ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేతలు సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అయినా ఓటర్లు మాత్రం తీర్పు మరోలా ఇచ్చారు. ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇదే కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎం సొంత జిల్లాలోని మహబూబ్‌నగర్‌తో పాటు చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కూడా ప్రతిష్ఠాత్మకంగానే తీసుకున్నారు. కానీ సిట్టింగ్ సహా మూడు స్థానాల్లో ఆయనకు ఎదురుగాలి వీయడం గమనార్హం.

తెలంగాణ పోలీస్ అకాడమీ ఇంటర్‌చేంజ్ రోటరీ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఔటర్ కూడళ్లలో ట్రాఫిక్ చిక్కులు

రీ డిజైన్ చేపట్టని అధికారులు

నిత్యకృత్యంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య

సిటీబ్యూరో, జూన్ 4 (నమేస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డు ఇంటర్ చేంజ్‌ల వద్ద శాస్త్రీయంగా నిర్మాణం చేపట్టకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలకు దారి తీస్తోంది. గ్రేటర్ చుట్టూ 158 కి.మీ. మేర నిర్మించిన ఔటర్ రింగు రోడ్డుపై 21 చోట్ల ఇంటర్ చేంజ్‌లను నిర్మించినా.. ఒక్కోచోట ఒక్కో రకంగా నిర్మించారు. ముఖ్యంగా రోటరీలు నిర్మించిన చోట వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఓఆర్ఆర్ మీదుగా వచ్చే వాహనాలు కిందకు దిగే సమయంలో వృత్తాకారంలో రోటరీ నిర్మించడంతో అక్కడ ఒకేసారి 5 మార్గాల నుంచి వాహనాలు వస్తున్నాయి. దీంతో ఆ రోటరీ చుట్టూ తిరిగి వెళ్లే సమయంలో కొందరు వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. అదే సమయంలో వాహనాల రద్దీ పెరిగినప్పుడు ఒక్కసారిగా రోటరీ చుట్టు వాహనాలు బారులు తీరుతుండటంతో ట్రాఫిక్ సమస్యలకు దారి తీస్తోంది. ఆయా రోటరీల వద్ద తరచూ ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించకపోవడంతో ట్రాఫిక్ తీవ్ర స్థాయికి చేరుకుంటోంది. ఈ రోటరీలు అత్యధికంగా ట్రాఫిక్ రద్దీ ఉండే నానక్‌రాంగూడ, నార్సింగి, తెలంగాణ పోలీస్ అకాడమీ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్‌లలో ఉన్నాయి.

రీ డిజైన్‌తోనే పరిష్కారం..

నగర శివారు ప్రాంతమైన నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ చుట్టు పక్కల భారీ సంఖ్యలో ఆకాశహర్మ్యాలు నిర్మాణంలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ కూడలిలో ఖాజాగూడ వైపు రోడ్డుకు ఇరువైపులా 22 అంతస్తుల నుంచి మొదలుకొని 36 అంతస్తులతో భారీ బహుళ అంతస్తుల వ్యాపార, వాణిజ్య భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. కూడలికి మరోవైపు సుమారు 10 భారీ భవనాల నిర్మాణం పూర్తి కాగా, మరో ఐదు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ 10 నుంచి 36 అంతస్తుల వరకు ఉండటంతో భవిష్యత్తులోనూ ఈ కూడలి చుట్టు పక్కల భారీ ఎత్తున వాహనాల రాకపోకలు ఉండనున్నాయి. దీంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తారా స్థాయికి చేరుకుంటాయని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నాయి. ఔటర్ రింగు రోడ్డును నిర్మించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అధికారులు దీనిపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని, ఇంటర్‌చేంజ్‌ను రీ డిజైన్ చేసి ట్రాఫిక్ చిక్కులు లేకుండా వాహనాల రాకపోకలు సాగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు.

శరవేగంగా విస్తరిస్తున్న ఐటీ కారిడార్..

ప్రస్తుతం రాయదుర్గం వరకు ఉన్న మెట్రో రైలు మార్గాన్ని ఐటీ కారిడార్‌లోని ఫైనాన్సియల్ డిస్ట్రిక్ వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. నగరం నలుమూలల నుంచి ఐటీ ఉద్యోగులు, భవన నిర్మాణ రంగంలో పనిచేసే వారు, ఇతరులు ఈ ప్రాంతానికి నిత్యం రాకపోకలు సాగించే అవకాశం ఉండటంతో నానక్‌రాంగూడ కూడలి అత్యంత కీలకంగా మారనున్నది. ఈ నేపథ్యంలో రోటరీ తరహాలో ఉన్న కూడళ్ల డిజైన్‌పై పట్టణ ట్రాఫిక్ నిపుణులతో అధ్యయనం చేసి ఇంటర్‌చేంజ్‌ల వద్ద ఎదురయ్యే ట్రాఫిక్ చిక్కులకు పరిష్కార మార్గాలను కనుగొనాల్సిన బాధ్యతపై హెచ్ఎండీఏ అధికారులపై ఉన్నది. ముఖ్యంగా.. ఐటీ కారిడార్‌లో అభివృద్ధి శరవేగంగా చోటు చేసుకోవడంతో పరిస్థితులు చాలా వేగంగా మారిపోతున్నాయి. ఓఆర్ఆర్‌తో అనుసంధానం ప్రారంభమయ్యే గచ్చిబౌలి నుంచి మొదలుకొని తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, గచ్చిబౌలి ట్రిపుల్ కూడలి నుంచి మొదలుకొని కోకాపేట ఇంటర్‌చేంజ్ వరకు ఐటీ కారిడార్ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లోనే ఐటీ కంపెనీలతో పాటు నివాస ప్రాంతాలు భారీ సంఖ్యలో వస్తుండటంతో ఇక్కడి రోడ్లు, ట్రాఫిక్ కూడళ్లు సరిపోయే పరిస్థితి లేదని ట్రాఫిక్ నిపుణులు పేర్కొంటున్నారు. దీనికి తోడు ఐటీ కారిడార్ పరిధి తర్వాత ఉన్న హైదరాబాద్– బీజాపూర్ రోడ్డు జాతీయ రహదారి ప్రారంభమయ్యే తెలంగాణ పోలీస్ అకాడమీ ఇంటర్‌చేంజ్ వద్ద ఉన్న రోటరీలు ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవు తున్నాయని గుర్తించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్న ఇంటర్‌చేంజ్ కూడళ్లపై సమగ్రంగా అధ్యయనం చేసి శాశ్వత పరిష్కార మార్గం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

గురుకులాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభుదాస్

ఆర్కేపురం, జూన్ 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సరూర్‌నగర్ వీఎం హోం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వడ్డేపల్లి ప్రభుదాస్, కార్యదర్శిగా పి.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

మంచాల, జూన్ 4 : గ్రామాల్లోని యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతకు సోమవారం రాత్రి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వాల పని విధానాలపై ఆలోచించి, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు యువకులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పగడాల యాదయ్య, రావుల జంగయ్య, గొర్రెంకల నర్సింహ, బొడ్డు నాగరాజు, చంద్రయ్య, రాంరెడ్డి, బాషయ్య, జిలమోని పాండు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కురిసిన వర్షం

చేవెళ్ల లో మంగళవారం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కురవడంతో వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు కొంతమేరకు ఉపశమనం పొందారు.

– చేవెళ్లటౌన్, జూన్ 4